



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

‘భూ భారతి’పై అపోహలొద్దు

» మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ పోట్రు

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందని, దీనిపై అపోహలు వద్దని కలెక్టర్ గౌతమ్ పోట్రు తెలిపారు. ఎదులాబాద్ డీఎస్ఆర్ గార్డెన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల నుంచి నేరుగా దరఖాస్తులను స్వీకరించి భూ సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. తప్పుల సవరణ, సర్వే సమస్యలు, ఆర్‌వోఆర్ సమస్యల పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. ఘట్‌కేసర్ మండలంలో పీవోటీ సమస్యలు చాలా వరకు పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఆర్డీవో వెంకటఉపేందర్‌రెడ్డి, మల్కాజ్‌గిరి ఏసీపీ చక్రపాణి, తహసీల్దార్ డీఎస్ రజిని, సింగిల్ విండో చైర్మన్ రామిరెడ్డి, వైస్‌చైర్మన్ అనంతరెడ్డి, మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

తాగునీటి ఎద్దడి తలెత్తనీయొద్దు

» వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో తాగునీటి సమస్యల పరిష్కారంపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నీటి సరఫరాకు సంబంధించిన పైపుల మరమ్మతు పనులు, నీటిని సరఫరా చేసేందుకు వీలుగా మోటార్ల కొనుగోలు తదితర పనులు సత్వరం చేపట్టాలని సూచించారు. బోర్ల వద్ద ఇంకుడు గుంతల నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా అవసరమైన స్థానిక వనరులను ఉపయోగించుకోవాలన్నారు. ఇందుకు అవసరమైన నిధులను మంజూరు చేస్తానని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, సీపీవో వెంకటేశ్వర్లు, మిషన్ భగీరథ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్లు రవి, చల్మారెడ్డి డీఈలు పాల్గొన్నారు.

ఒకప్పుడు దేశ, విదేశాలకు ఎగుమతి చేసిన హైదరాబాద్ అంగూర్ క్రమేపి తన ఉనికిని కోల్పోతూ కనుమరుగవుతోంది. పెరిగిన పెట్టుబడి వ్యయం, కూలీల కొరత, నీటి ఎద్దడి వీటికి తోడు రియల్ వ్యాపారం పుణ్యమా అని రోజురోజుకు జిల్లాలో సాగు పూర్తిగా తగ్గిపోయింది. ఒకప్పుడు ద్రాక్ష సాగుకు మేడ్చల్ నియోజకవర్గం పెట్టింది పేరు. ఇక్కడి నేలలు ఈ సాగుకు అనుకూలం. కానీ ఒకప్పుడు వేల ఎకరాల్లో కనిపించిన అంగూర నేడు వందల ఎకరాల్లోకి చేరింది. ఈ పరిస్థితి ఇలాగే ఉంటే మరో రెండు మూడేళ్లలో పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది.



అందని ద్రాక్ష!

కనుమరుగవుతున్న హైదరాబాద్ అంగూర్

భారీగా తగ్గిన సాగు విస్తీర్ణం
పెరిగిన కూలి రేట్లు, ఎరువుల ధరలు
దీనికి తోడు కొంపముంచిన రియల్ వ్యాపారం
మేడ్చల్‌లో పూర్తిగా తగ్గిన ద్రాక్ష సాగు
కనిపించని ఎక్స్‌పోర్టు క్వాలిటీ పంట
మహారాష్ట్ర నుంచి భారీగాదిగుమతి..
నష్టాల్లో స్థానిక రైతులు


తోట లేక మిగిలిన కడీలు

మేడ్చల్ ప్రతినిధి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ నియోజకవర్గంలోని మేడ్చల్, శామీర్‌పేట, కీసర, ఘట్‌కేసర్ మండలాల్లోని పలు గ్రామాల్లో అంగూర్ తోటలను సాగు చేసేవారు. సీడ్(విత్తులు), సీడ్‌లెస్ ద్రాక్ష(ఎక్స్‌పోర్టు క్వాలిటీ)ను ఇక్కడ సాగు చేసి విదేశాలకు సైతం ప్రత్యేక కంటేనర్లలో ఎగుమతి చేసేవారు. బ్లాక్ గ్రేప్‌లో ఫ్లేమ్, శరత్, వైట్ గ్రేప్‌లో శ్యాంసన్, తాజ్‌గణేశ్, సోనాకా రకాలను ఇక్కడి రైతులు పండించేవారు. సంవత్సరం పాటు శ్రమించి సాగు చేపడితే దిగుబడి ఫిబ్రవరి నెలలో మార్కెట్‌లోకి వస్తుంది. అలాగే మూడు నెలల్లో పంట కోత ముగుస్తుంది. ఇంతటి పేరు ప్రఖ్యాతలు ఉన్న ద్రాక్ష సాగు నేడు జిల్లాలో కనుమరుగవుతోంది. ఎకరా ద్రాక్ష సాగులో ఉపయోగించే ఎరువులు, పురుగు మందుల ధరలు విపరీతంగా పెరగడంతో పెట్టుబడి వ్యయం లక్షల్లోకి చేరింది. దీనికితోడు కూలీల కొరత కూడా ఎక్కువగా ఉందని స్థానిక రైతులు వాపోతున్నారు.

అక్కడక్కడ పెద్ద రైతులు మాత్రమే

నగరానికి మేడ్చల్ నియోజకవర్గం ఆనుకుని ఉండటంతో ఇక్కడి భూముల రేట్లు విపరీతంగా పెరిగాయి. దీంతో

మిగతా 8వ పేజీలో...

గిట్టుబాటు కావడం లేదు



కూలీల రేట్లు, ఎరువుల ధరలు పెరగడంతో ద్రాక్ష పంట గిట్టుబాటు కావడం లేదు. దీనికితోడు వాతావరణం కూడా అనుకూలించడం లేదు. పంట చేతికొచ్చే సమయంలో వడగళ్ల వానలు భయపెడుతున్నాయి. 17 సంవత్సరాలుగా 16 ఎకరాల్లో ద్రాక్ష సాగు చేస్తున్నా. ఎంతో కష్టపడి సాగు చేసినా మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించడం లేదు. మహారాష్ట్ర ద్రాక్ష నాణ్యతగా లేనప్పటికీ వ్యాపారులు అక్కడి నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు.

-వెంకట్‌రెడ్డి, ద్రాక్షరైతు, మేడ్చల్

సమాచారం

టెండర్ల ఆహ్వానం

వికారాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వివిధ శాఖలకు సంబంధించి అన్ని ఔట్ సోర్సింగ్ సర్వీసులు ఏర్పాటు చేసేందుకు రిజిస్ట్రేషన్ ఉన్న ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు సీల్ టెండర్లు కోరుతున్నట్లు కలెక్టర్ ప్రతీక్ జైన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టెండర్ల డాక్యుమెంట్లను జిల్లా ఉపాధి కల్పన అధికారి మే 6వ తేదీ సాయంత్రం వరకు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. సీల్ టెండర్లను మే 6 మధ్యాహ్నం 3.30 నిమిషాలకు అందుబాటులో ఉన్న ఏజెన్సీల సమక్షంలో కలెక్టరేట్‌లో టెండర్లను తెరుస్తారన్నారు. ఇతర సమాచార నిమిత్తం జిల్లా ఉపాధి కల్పనాధికారిని నంబర్ 9177607016లో సంప్రదించాలన్నారు.

ప్రజావాణి రద్దు

వికారాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రతీక్‌జైన్ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో భూ భారతిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుండటంతో ఉండడంతో ఈ నెల 28, జరుగాల్సిన ప్రజావాణి వాయిదా వేశామన్నారు. మే 5న యథావిధిగా ప్రజావాణి కొనసాగుతుందని పేర్కొన్నారు.

భూగర్భ జలాలను పెంచడమే లక్ష్యం



మాట్లాడుతున్న డీఆర్‌డీవో శ్రీనివాస్

వికారాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నీటి సంరక్షణ, భూగర్భ జలాలను పెంచడమే లక్ష్యమని డీఆర్‌డీవో శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పులుమద్ది గ్రామంలో వాటర్ షెడ్ యాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాన నీటిని సంరక్షించి భూగర్భ జలాలను పెంచడమే వాటర్‌షెడ్ పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. నీటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ పూనుకోవాలని పిలుపునిస్తూ ప్రతిజ్ఞ చేయించారు. నీటి సంరక్షణపై విద్యార్థులు వ్యాసరచన, పెయింటింగ్స్ పలువురిని ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందించారు. కార్యక్రమంలో డీపీవో జయసుధ, ఏడీ గ్రౌండ్ వాటర్ రవి, ఎంపీడీవో డాక్టర్ వినయ్ కుమార్, ఎంపీవో డానియల్, ప్రాజెక్ట్ ఆఫీసర్ సతీశ్‌రెడి స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఉగ్రదాడికి నిరసన



పరిగి పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

పరిగి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడిని నిరసిస్తూ పరిగి మసీదు కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం పరిగి పట్టణంలో ముస్లింలు జామియా మసీదు నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మాజీ జెడ్పీటీసీ మీర్‌మహమూద్‌అలీ మాట్లాడుతూ కశ్మీర్‌లో ఉగ్రవాదులు అమాయకులను పొట్టన పెట్టుకోవడం అత్యంత దారుణమన్నారు. ఈ ఘటనకు కారణమైన సంస్థలను, వ్యక్తులను కఠినంగా శిక్షించి ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణచివేయాలన్నారు. మృతి చెందిన, గాయపడిన కుటుంబాలను ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో మసీద్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్‌మోహిజ్, ఉపాధ్యక్షుడు సమీపటేల్, నాయకులు పాషాబాయి, మీరుతాహేర్‌అలీ, మునీరు, సయ్యత్ అయూబ్ పాల్గొన్నారు.



ప్రాణం తీసిన సహజీవనం

హత్య చేసి ఆపై పెట్రోల్ పోసి తగులబెట్టిన ప్రియుడు
ధారూరు మండల పరిధిలోని రాజాపూర్‌లో ఘటన

7


సుదర్శన హోమం నిర్వహిస్తున్న భక్తులు, ఆలయ చైర్మన్ లక్ష్మీనారాయణ

ఘనంగా సుదర్శన హోమం

చీర్యాల్‌లో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



కీసర, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): చీర్యాల్ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు కనులపండువగా కొనసాగుతున్నాయి. రెండో రోజు శుక్రవారం తెల్లవారుజామున స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నవ కళశాభిషేకాలతో విశ్వక్సేనకు పూజ నిర్వహించారు. అనంతరం వేద మంత్రోచ్ఛరణలతో అగ్ని ప్రతిష్ఠ చేసి, సుదర్శన హోమం నిర్వహించారు. ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరి గౌడ్‌లు బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న భక్తులందరికీ అన్నవితరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే చామాకూర మల్లారెడ్డి, ఎమ్మెల్యే రాజ్‌ఠాగూర్ సతీమణి మనాలి, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి, కూన శ్రీశైలం గౌడ్, సినీ నటుడు బాబుమోహన్, ఎంవీరెడ్డి తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

నేడు స్వామివారి తిరు కల్యాణం

బ్రహ్మోత్సవాలల్లో భాగంగా నేడు(శనివారం) లక్ష్మీనారసింహుడి తిరు కల్యాణం నిర్వహించనున్నారు. యాదగిరి గుట్ట ప్రధాన అర్చకులు నృసింహ ఆచార్యుల అధ్వర్యంలో ఉదయం 10.00 గంటలకు జరిగే కల్యాణ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో రానున్నారు.

డెలివరీల్లో తాండూరు ఆస్పత్రి టాప్

రాష్ట్రంలోనే మొదటి స్థానం .. మార్చి నెలలో 456 ప్రసవాలు
ఏప్రిల్‌లోనూ ఇప్పటివరకు 327 డెలివరీలు

తాండూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): తాండూరు మాతా శిశు ఆరోగ్య కేంద్రం మార్చి నెలలో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల కంటే అత్యధికంగా 456 డెలివరీలు చేసి నంబర్ వన్ స్థానంలో నిలిచింది. అలాగే ఈ నెలలోనూ ఇప్పటివరకు 327 ప్రసవాలు చేశారు. అందులో అత్యధికంగా నార్మల్ డెలవరీలు చేసి ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకున్నారు. ఈ ఆస్పత్రికి తాండూరు నియోజకవర్గంలోని పెద్దేముల్, యాలాల, బషీరాబాద్, తాండూరు మండలాలతో పాటు సరిహద్దులో ఉన్న కర్ణాటక రాష్ట్రంలోని చించోళి, గుర్మిటికల్, పక్కనున్న కొడంగల్, పరిగి నియోజకవర్గాలకు చెందిన గర్భిణులు

మిగతా 8వ పేజీలో...



వరుణుడి ప్రతాపం

» మోమిన్‌పేట్, మర్పల్లి మండలాల్లో భారీ వర్షం
» మామిడి, బొప్పాయి తోటలకు నష్టం


మర్పల్లిలో అకాల వర్షానికి దెబ్బతిన్న బొప్పాయి తోట

వికారాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వికారాబాద్ జిల్లాలో శుక్రవారం సాయంత్రం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. మోమిన్‌పేట, మర్పల్లి మండలాల్లో భారీ వర్షం కురువగా, మిగతా మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. ఈదురుగాలులతో కురిసిన వర్షానికి మోమిన్‌పేట - వికారాబాద్ ప్రధాన రహదారిపై చెట్లు విరిగి పడడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షంతో జొన్న, వరి, కూరగాయ పంటలకు నష్టం వాటిల్లింది. మర్పల్లి మండలంలో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. బిల్కల్‌లో బొప్పాయి, మామిడి తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పట్లూర్, పంచలింగాల్, కొత్లాపూర్, తుమ్మలపల్లి, మొగిలిగుండ్లలో జొన్న పంట నేలకు ఒరిగిపోయి దెబ్బతినగా, ఈ గ్రామాల్లో నిల్వ చేసిన ఉల్లి పంట తడిసిపోయింది. సిరిపురం వద్ద రోడ్డుపైన చెట్లు విరిగిపడడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. మోమిన్‌పేట్ మండలంలో 22.8 మి.మీ. మర్పల్లిలో 16.0 మి.మీ., బంట్వారంలో 7.3 మి.మీ., బషీరాబాద్‌లో 4.0 మి.మీ. చొప్పున వర్షం కురిసింది.

మండుతున్న సూర్యుడు

» మేడ్చల్‌లో 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
» నిర్మానుష్యంగా మారిన రోడ్లు


ఖాళీగా కనిపిస్తున్న మేడ్చల్ రోడ్డు

మేడ్చల్/వికారాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్, వికారాబాద్ జిల్లాల్లో ఎండలు మండుతున్నాయి. శుక్రవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో గరిష్ఠంగా 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రోజురోజుకు తీవ్రమవుతున్న ఎండలతో వడగాల్పులకు ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నిత్యం సాధారణం కన్న 5 నుంచి 6 డిగ్రీల ఉష్ణోగ్రత అధికంగా నమోదవుతోంది. ఉదయం 9 గంటల నుంచే ఇళ్ల నుంచి బయటకు రావాలంటే జంకుతున్నారు. అత్యవసరంగా బయటకు వెళ్లేవారు గొడుగు, క్యాప్‌లు ధరించి బయటకు వెళ్తున్న పరిస్థితి. ఎండ నుంచి ఉపశమనం పొందడానికి శీతల పానీయాలను ఆశ్రయిస్తున్నారు. వేడిమికి మధ్యాహ్నం వేళ రోడ్లన్నీ నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. అలాగే వికారాబాద్ జిల్లాలో అత్యధికంగా మన్నెగూడలో 41.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, కొడంగల్‌లో 41.7, తొరమామిడి, దౌల్తాబాద్, మర్పల్లిలో 41.6, పెద్ద ఉమ్మెంతాల్‌లో 41.5, కోట్‌పల్లిలో 41.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వికారాబాద్, మోమిన్‌పేట్‌లో 41.2 డిగ్రీలు, దోమ, పరిగిలో 41.0 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసిన నాయకులు



ఆమనగల్లు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈనెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున జనం తరలివచ్చేలా చూడాలని ఆదేశించినట్లు వారు పేర్కొన్నారు. నాయకులు గోపాల్‌నాయక్, వెంకట్‌రెడ్డి, వంశి, గణేశ్, తదితరులు ఉన్నారు.

అడుగుకో గుంత.. ఆదమరిస్తే తంటా

పెద్దేముల్ రోడ్లపై నిత్యం ప్రమాదాలు

పట్టించుకోని అధికారులు

ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

పెద్దేముల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రోడ్లపై గుంతలు వాహనదారుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి.తత పెద్దేముల్ మండలంలో రోడ్లపై ప్రయాణం చేయాలంటేనే అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని ముందుకు సాగుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుంతలు పడ్డ రోడ్లపై ప్రమాదాలు జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు.

ప్యాచ్ వర్క్‌లపై పట్టింపేది?

మండల పరిధిలోని రోడ్లపై పడిన గుంతలకు ప్యాచ్‌వర్క్ చేయడం లేదు. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. తాండూరు-హైదరాబాద్ రోడ్డులో పెద్దేముల్ మండలంలోని కందనెల్లి శివారు నుంచి మన్‌సాన్‌పల్లి శివారు వరకు గుంతలు పడడంతో వాహనదారులు నరకం చూస్తున్నారు. ఖానాపూర్ గేటు సమీపంలో రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. ఇక్కడ అడుగడుగునా పడిన గుంతలతో నానా ఇబ్బందులు పడుతున్నారు. వాటిని తప్పించే క్రమంలో వాహనదారులు అదుపుతప్పి కిందపడి గాయాలపాలవుతున్నారు. ఇటీవల గుంతలను తప్పించబోయి ఇద్దరు ద్విచక్రవాహనదారులు ప్రాణాలు కోల్పోయారు. హైదరాబాద్ నుంచి తాండూరులో ఒక వేడుకకు హాజరుకావడానికి కారులో వస్తున్న యువకులు గుంతలను తప్పించే క్రమంలో కారుపల్టీలు కొట్టడంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి.



పెద్దేముల్ మండలం ఖానాపూర్ గేటు సమీపంలోని వాడుకవద్ద గుంతల కారణంగా ఢీకొన్న తతకార్లు

రెండు కార్లు ఢీ

ఈ రోడ్డుపై శుక్రవారం రెండు కార్లు ఢీకొన్నాయి. ముందర వెళ్తున్న కారు డ్రైవర్ గుంత వద్ద సడెన్ బ్రేకు వేశాడు. దీంతో వెనకాల వస్తున్న కారు ముందు ఉన్న కారును బలంగా ఢీకొట్టింది. ఈప్రమాదంలో పలువురు గాయలతో బయటపడ్డారు. కార్లు రెండు చాలావరకు దెబ్బతిన్నాయి. గుంతలు పడ్డచోట మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి



మాట్లాడుతున్న ఎఫ్ఎంఈ విభాగాధిపతి కిరణ్మయి

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతిఒక్కరూ పాటుపడాలని ఎఫ్ఎంఈ విభాగాధిపతి కిరణ్మయి అన్నారు. శుక్రవారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు ఎకోటెక్ పేరిట పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రకృతి సమతుల్యాన్ని కాపాడుకోవాలంటే పర్యావరణాన్ని దెబ్బతీయొద్దన్నారు. సాంకేతిక రంగంలో అభివృద్ధిని సాధిస్తూనే ప్రకృతిని కాపాడుకోవాలన్నారు. భవిష్యత్తులో స్మార్ట్ వ్యవసాయం, క్లీన్ టెక్నాలజీలు ప్రకృతి పర్యావరణ రక్షణలో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జె.నర్సింహారెడ్డి, కార్యదర్శి త్రిశూల్‌రెడ్డి, త్రిలోక్‌రెడ్డి ప్రిన్సిపాల్ లోకనాథం, వైస్‌ప్రిన్సిపాల్ పురుషోత్తం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి

- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



జూనియర్ కళాశాల రెండో ఫ్లోర్ స్లాబ్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి చరిత్రలో నిలిచేవిధంగా అన్ని సౌకర్యాలతో జూనియర్ కళాశాల భవనాన్ని నిర్మిస్తున్నట్టు ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. దాతల సహకారంతో నిర్మిస్తున్న షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం రెండో అంతస్తు స్లాబ్ పనులను, గ్రౌండ్‌ఫ్లోర్ గదుల నిర్మాణ పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దాదాపు రూ.15 కోట్లతో నిర్మిస్తున్న భవనానికి దాతలు సహకరిస్తున్నారని, అవసరమైతే తన సొంత డబ్బును కూడా ఖర్చుచేసి నిర్మాణ పనులను పూర్తి చేస్తానని తెలిపారు. భవన నిర్మాణానికి సహకారం అందిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. దగ్గరుండి పనులను పర్యవేక్షిస్తున్న చెంది తిరుపతిరెడ్డి, లింగారెడ్డిగూడెం అశోక్‌ను అభినందించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్, కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి, రఘునాయక్, అగ్గనూరి బస్వం, సుదర్శన్‌గౌడ్, జంగ నర్సింహ్మయాదవ్, చలివేంద్రం రాజు, శ్రీశైలంగౌడ్, అందె మోహన్, ఖదీర్, కావలి శ్రీశైలం, ముబారక్, నడికూడ యాదగిరి, రాయికల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రజతోత్సవ వేళ.. బీఆర్ఎస్‌లో రగడ

- సమన్వయ కమిటీ సమావేశంలో నాయకుల ఆగ్రహ జ్వాలలు
- పార్టీ గీత దాటితే చర్యలు తప్పవు: మాజీ ఎమ్మెల్యే

కడ్తాల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకల వేళ నాయకుల మధ్య రగడ జరిగింది. మండల కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ నివాసంలో గురువారం రాత్రి మండల సమన్వయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కొందరు నేతలు అసంతృప్తి, ఆగ్రహాలు వెళ్లగక్కారు. డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్‌ను ఉద్దేశించి మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ మాట్లాడుతూ ఇటీవల హరీశ్‌రావు పర్యటన సందర్భంగా ఇతర పార్టీలతో చేతులు కలిపి పార్టీకి నష్టం చేశారని వ్యాఖ్యానించారు. అందుకు గంప వెంకటేశ్ తీవ్ర అభ్యంతరం తెలిపారు. పార్టీ కోసం తన ఆస్తులు అమ్ముకున్నానన్నారు. ఎవరికోసం ఆస్తులు అమ్ముకున్నావంటూ ఆనంద్ ప్రశ్నించడంతో మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ జోక్యం చేసుకొని వెంకటేశ్‌పై మండిపడ్డారు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ కడ్తాల మండలంలో జోక్యం చేసుకోవడమేమిటని దశరథ్, ఆనంద్ అభ్యంతరం తెలిపారు. రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి నేతల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. దూషణలు తీవ్రమవుతున్న సమయంలో మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి జోక్యం చేసుకొని శాంతింపజేశారు. పార్టీ గీత దాటి నష్టం చేస్తే చర్యలు తప్పవని మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ నేతలను హెచ్చరించారు. అందరు సమన్వయంతో ముందుకు సాగి రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కోరారు.

రాజ్యాంగ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. మాడ్గుల మండల కేంద్రంలో శుక్రవారం జై బాపు.. జైభీం.. జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగానికి ప్రమాదం ఏర్పడిందని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భట్టు కిషన్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి సూదిని రాంరెడ్డి, మాజీ జడ్పీటీసీ ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ జంగయ్య, విజయ పాలసేకరణ కేంద్రం చైర్మన్ బొజ్జ సాయిరెడ్డి, సూదిని కొండల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ రైతులకు బోరుమోటార్లు మంజూరు

మాడ్గుల, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మాడ్గుల మండలంలోని కొర్రతండా, కాంత్రాంతండా, గుడితండాకు చెందిన ఎస్టీ రైతులు 55 మందికి రూ.80వేల విలువ గల బోరుమోటర్లను శుక్రవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అందజేశారు. 2023లో మంజూరైన వీటిని వాసవి ఫంక్షన్‌హాల్‌లో అందజేశారు. మాడ్గుల వైస్ ఎంపీపీ శంకర్‌నాయక్ కృషితో రైతులకు బోరు మోటర్లు అందించినట్లు తెలిపారు.

ఏఎంసీ చైర్మన్‌కు కలెక్టర్ సన్మానం

ఆమనగల్లు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీతానర్సింహను కలెక్టర్ నారాయణరెడ్డి సన్మానించారు. పట్టణంలో నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సుకు హాజరైన కలెక్టర్ మార్కెట్‌కు ఇటీవల చైర్‌పర్సన్‌గా నియమితులైన విషయం తెలుసుకొని గీతను సత్కరించి అభినందించారు. రైతుల సమస్యల పరిష్కారానికి మార్కెట్‌యార్డ్ అభివృద్ధికి, ఆదాయం పెంపునకు చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ లలిత, మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్, ఎంపీడీవో మాధురి, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేశ్, ఎస్‌ఐ వెంకటేశ్, మాజీ వైస్‌ఎంపీపీ నిట్ట నారాయణ, నాయకులు యాటనర్సింహ, జగన్, శ్రీకాంత్, శ్రీశైలం, అంజయ్య, పరీద్, తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

- మేడ్చల్ అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. మేడ్చల్ జిల్లా ఏదులాబాద్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రమించి లబ్ధి పొందాలని సూచించారు. హమాలీల కొరత లేకుండా చూడాలన్నారు. ఆయనవెంట పౌరసరఫరాల జిల్లా మేనేజర్ ఎల్.సుగుణాబాయి, ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి, తహసీల్దార్ డీఎస్ రజిని, మండల వ్యవసాయ అధికారి ఎంఏ బాసిత్, తదితరులు ఉన్నారు.

పరిగిలో హిజ్రాల హల్‌చల్

- దొంగ హిజ్రాలను చితకబాదిన అసలైన వారు

పరిగి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పరిగి పట్టణంలో హిజ్రాలు హల్‌చల్ చేశారు. హిజ్రాలు, హిజ్రాల వేషాధారణతో వచ్చిన వ్యక్తుల మధ్య తలెత్తిన వివాదం ఘర్షణకు దారితీసింది. నడీ రోడ్డుపై ఒకరినొకరు తోసుకుంటూ కొట్టుకున్నారు. శుక్రవారం జరిగిన ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళ్తే.. రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం పులుసుమామిడి గ్రామానికి చెందిన నర్సింహులు, యాదయ్య కష్టపడకుండా డబ్బులు సంపాదించాలనే ఆశతో హిజ్రాల వలే చీర కట్టుకొని కొంతకాలంగా పరిగి పట్టణంలో తిరుగుతూ డబ్బులు వసూలు చేస్తున్నారు. పరిగిలో ఉంటున్న కొందరు హిజ్రాలు బహార్‌పేట్ చౌరస్తాలో నకిలీ హిజ్రాలను గమనించి పట్టుకున్నారు. నడీ రోడ్డుపై వెంట్రుకలు పట్టుకొని ఒకరికొకరు తోసుకుంటూ కొట్టుకున్నారు. అనంతరం హిజ్రాల వేషధారణలో ఉన్న ఇద్దరిని ఆటోలో పట్టణ శివారులోకి తీసుకెళ్లారు. అక్కడ బట్టలు విప్పించి నిలదీశారు. దీంతో ఆ ఇద్దరు తమది తప్పేనని, భార్యా, పిల్లలు ఉన్నారని, మరోసారి ఇలా చేయమని చెప్పడంతో వారిని హిజ్రాలు వదిలేశారు. ఈ తతంగాన్ని కొందరు వ్యక్తులు వీడియో తీసి సోషల్ మిడియాలో పెట్టడంతో వైరల్‌గా మారింది.

రజతోత్సవ వేడుకలను విజయవంతం చేయాలి

షాబాద్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని మాజీ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం షాబాద్‌లో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీఆర్ఎస్ 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 27న పార్టీ అధినేత కేసీఆర్ నేతృత్వంలో వరంగల్‌లో నిర్వహించే బహిరంగ సభకు షాబాద్ మండలం నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నర్సింగ్‌రావు, కార్యదర్శి శ్రీరాంరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, నర్సింహారెడ్డి, నాయకులు వెంకట్‌యాదవ్, చాంద్‌పాషా పాల్గొన్నారు.

ఉప్పెనలా తరలిరావాలి

కడ్తాల్: బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు బీఆర్ఎస్ నేతలు, గిరిజనులు ఉప్పెనలా తరలిరావాలని మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ పిలుపునిచ్చారు. మండలంలోని పోచమ్మ గడ్డ తండాలో శుక్రవారం బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతంపై సన్నాహక సమావేశం నిర్వహించి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

పీహెచ్‌సీలకు వీల్‌చైర్లు అందజేత

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు జూబ్లీహిల్స్ రోటరీ క్లబ్ ప్రతినిధులు 10 వీల్‌చైర్స్‌ను అందించారు. జిల్లాలోని సరూర్‌నగగర్, శేరిలింగంపల్లి, బాలాపూర్, మొయినాబాద్, నార్సింగిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రెండు చొప్పున వీటిని అందించారు. ఈ వీల్ చైర్లను జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు, ఏవో మొహ్మద్ షఫియోద్దీన్ రోటరీ క్లబ్ ప్రతినిధులచే అందుకున్నారు. వీటిని పీహెచ్‌సీలకు అందజేయనున్నట్లు జిల్లా వైద్యాధికారి తెలిపారు.

ఇంటర్ ఫెయిల్.. విద్యార్థి ఆత్మహత్య

- ఫస్టియర్‌లో 90 శాతం మార్కులు
- సెకండియర్‌లో మూడు సబ్జెక్ట్‌లు ఫెయిల్



భూషి జస్వంత్(ఫైల్)

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఇంటర్‌లో ఫెయిల్ కావడంతో ఓ విద్యార్థి తీవ్ర మనస్థాపానికి గురై పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మేడ్చల్ జిల్లా పోచారం ఐటీ కారిడార్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా కేంద్రం హనుమాన్‌వాడకు చెందిన భూషి వెంకటేశ్ కుమారుడు జస్వంత్(17) పోచారం మున్సిపాలిటీ, అన్నోజిగూడలోని నారాయణ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. మొదటి సంవత్సరం పరీక్ష ఫలితాల్లో 90శాతం మార్కులు రాగా, ద్వితీయ సంవత్సరంలో మూడు సబ్జెక్టుల్లో ఫెయిల్ అయ్యాడు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన జస్వంత్ కళాశాలలో 24వ తేదీన గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన సిబ్బంది చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. జస్వంత్ చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. మూడు సబ్జెక్టుల్లో ఫెయిల్ కావడం వల్ల తీవ్ర మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడని జస్వంత్ తండ్రి వెంకటేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న మోదీ సర్కార్

- కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి హర్షలత చౌదరి



రామచంద్రగూడలో ప్రతిజ్ఞ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మహేశ్వరం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రధాని మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి హర్షలతచౌదరి ఆరోపించారు. కాంగ్రెస్ తలపెట్టిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని రామచంద్రగూడ, పెండ్యాల, మన్‌సాన్‌పల్లి గ్రామాల్లో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయమే ధ్యేయంగా కాంగ్రెస్ పని చేస్తుందని, సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ నందిగామ నర్సింహ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సీహెచ్.యాదయ్య, ఐఎన్‌టీయూసీ నియోజకవర్గం అధ్యక్షుడు నడికూడ శివ, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు కాకి ఈశ్వర్, అల్లెకుమార్, యాదయ్య, ఎన్.రాజునాయక్, లాజర్, సుభాష్, ప్రవీణ్, నవీన్, రాజు, దర్శన్, మల్లేష్ పాల్గొన్నారు.

ఉగ్రదాడి మృతులకు నివాళి



కలెక్టరేట్ వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

మేడ్చల్ ప్రతినిధి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పెహల్గాం ఉగ్రవాద దాడిలో మృతి చెందిన వారికి శుక్రవారం మేడ్చల్ - మల్కాజిగిరి కలెక్టరేట్ వద్ద జిల్లా తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొవ్వొత్తులు వెలిగించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ఉగ్రవాదుల చర్యను తీవ్రంగా ఖండించారు. వారి ఆత్మకు శాంతి చేకూరేలా రెండు నిముషాల మౌనం పాటించారు. కార్యక్రమంలో టీజీఈ చైర్మన్ రవిప్రకాశ్, జనరల్ సెక్రటరీ వినోద్‌కుమార్, వివిధ ఉద్యోగ సంఘాల అధ్యక్షులు, కలెక్టరేట్ ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

వీబీఐటీలో విద్యార్థినుల ఆందోళన

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): తమకు తెలియకుండా ఫొటోలు, వీడియోలు తీసి కళాశాల యాజమాన్యానికి పంపించారని శుక్రవారం విజ్ఞాన భారతి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు ఆందోళనకు దిగారు. రాత్రి హాస్టల్ భోజనంలో పురుగులు వచ్చాయని ఆరోపిస్తూ విద్యార్థులు గురువారం వార్డెన్ రూపను నిలదీసి, ఆందోళన చేపట్టారు. దీంతో వార్డెన్ ఆందోళన చేస్తున్న విద్యార్థినుల ఫొటోలు, వీడియోలు తీసి చీఫ్‌వార్డెన్ సత్యనారాయణగౌడ్‌కు పంపించారు. దీంతో విద్యార్థులు శుక్రవారం తరగతులను బహిష్కరించి ఆందోళనకు దిగారు. వార్డెన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేసి కళాశాల ఆవరణలో వస్తువులను ధ్వంసం చేశారు. ప్రిన్సిపల్ పీవీఎస్ శ్రీనివాస్ విద్యార్థులతో మాట్లాడి విషయం తెలుసుకున్నారు. వార్డెన్ ఫోన్ చూడగా ఎలాంటి అసభ్యకరమైన ఫొటోలు, వీడియోలు లేకపోవడంతో తిరిగి వారి ఫోన్ వారికి ఇచ్చి వార్డెన్‌ను పంపించారు. ఆందోళన ఎక్కువ కావడంతో పోలీసులు చేరుకొని వివాదాన్ని శాంతిపజేశారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర మహిళా కమిషన్ కార్యదర్శి ప్రద్మజారాణి, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వ్యక్తిగత కార్యదర్శి సాధ్య సాయంత్రం కళాశాలకు చేరుకున్నారు. విద్యార్థినులు, కళాశాల యాజమాన్యంతో మాట్లాడారు. నివేదిక తయారు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎవరి వీడియోలు, ఫొటోలు తీయలేదని కళాశాల యాజమాన్యం తెలిపింది.

మేడేను జయప్రదం చేయాలి

కందుకూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మేడే ఉత్సవాలను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ కోరారు. శుక్రవారం కార్మికులతో కలిసి మండల కేంద్రంలో పోస్టర్‌ను విడుదల చేసి మాట్లాడారు. కార్మిక దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా కార్మికులు పండుగగా నిర్వహించుకోవాలన్నారు. పెట్టుబడుదారులు, కార్పొరేట్ శక్తుల మీద కార్మికులు సాధించిన గొప్ప విజయం మేడే అన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు చందు, నర్సింహ, నాయకులు భరత్, నరసింహ, యాదయ్య, మహిపాల్‌గౌడ్, శ్రీశైలం, అంజయ్య, శ్రీను, రాజు, గణేష్, జంగయ్య, గండు మహేందర్, కృష్ణ పాల్గొన్నారు.

ప్రాణం తీసిన సహజీవనం

- హత్య చేసి ఆపై తగులబెట్టిన ప్రియుడు



వెంకటమ్మ(ఫైల్)

ధారూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): భార్య వదిలేయటంతో మరో మహిళతో సహజీవనం చేస్తున్న ప్రియుడు ఆమెను హత్యచేసి మృతదేహంపై పెట్రోల్ పోసి తగులబెట్టాడు. ఈ ఘటన మండల పరిధిలోని రాజాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ అనిత, స్థానికులు తెలిపిన ప్రకారం.. రాజాపూర్ గ్రామానికి చెందిన మేతరి బాబయ్యకు పరిగి మండలం చిట్యాల్ గ్రామానికి చెందిన అనంతతో 20ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి నలుగురు కూతుళ్లు. బాబయ్య మద్యానికి అలవాటుపడి అడ్డమీది మహిళా కూలీలతో వివాహేతర సంబంధం కొనసాగించేవాడు. దీంతో భార్యాభర్తల మధ్య తరుచూ గొడవలు జరిగేవి. భర్త బాబాయ్య వేధింపులు భరించలేక రెండేళ్ల కిందట ఇంటి నుంచి తల్లిగారింటికి వెళ్లి తిరిగి రాలేదు. ఈ క్రమంలో దోమ మండలం రాకొండ గ్రామానికి చెందిన మహిళా కూలీ బండి వెంకటమ్మ(47)తో బాబయ్య వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. రాజాపూర్‌లో రెండు నెలలుగా వీరిద్దరు సహజీవనం చేస్తున్నారు. శుక్రవారం రాత్రి ఇంట్లో వెంకటమ్మను చంపి మృతదేహాన్ని గొనె సంచిలో వేసుకొని గ్రామంలో పాడుబడిన ఇంట్లో పడేసి పెట్రోల్ పోసి తగులబెట్టాడు. దీనిని గ్రామస్తులు గుర్తించడంతో బాబయ్య అక్కడి నుంచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ అనిత గ్రామానికి వెళ్లి మృతదేహన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. హత్యకు గల కారణాలు తెలియరాలేదని, మృతురాలి కుమారుడు నవీన్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాబయ్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పరారీలో ఉన్న బాబయ్య కోసం గాలిస్తున్నామని చెప్పారు.

కొనుగోలు చేసిన అసైన్డ్ భూమి స్వాధీనం



బోర్డు పాతుతున్న రెవెన్యూ అధికారులు

ధారూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు చేసిన 4.08 ఎకరాల అసైన్డ్ భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తహసీల్దార్ సాజిదాబేగం తెలిపిన ప్రకారం.. ధారూరుకు చెందిన చాకలి శంకరయ్యకు సర్వే నంబరు 197/4లో 2.04ఎకరాల అసైన్డ్ భూమి ఉంది. ఈ భూమిని ధారూరుకు చెందిన శెట్టి లలితాదేవి చాలాకాలం క్రితం కొనుగోలు చేసి పట్టా మార్పిడి చేసుకుంది. ధారూరు గ్రామానికి చెందిన పత్తి ఎల్లయ్యకు సర్వే నంబరు 197/5లో 02.04 ఎకరాల అసైన్డ్ భూమి ఉంది. ఈ భూమిని అదే గ్రామానికి చెందిన ఎ.లక్ష్మి గతంలో కొనుగోలు చేసి పట్టా మార్పిడి చేసుకుంది. ఈ అసైన్డ్ భూములను కొనుగోలు చేయటంపై పత్తి ఎల్లయ్య భార్య అమృతమ్మ ఇచ్చిన ఫిర్యాదుపై రెవెన్యూ అధికారులు విచారణ జరిపి నోటీసులిచ్చారు. వారి సంజాయిషీ సంతృప్తికరంగా లేకపోవటం, నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ భూమిని కొనుగోలు చేసినట్లు నిర్ధారించి స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఐ స్వప్న, అడిషనల్ ఆర్ఐ అంజలి, సర్వేయర్ శ్రీహరి రెవెన్యూ సిబ్బంది శుక్రవారం భూముల్లో ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డు పాతారు.

ఆంధ్రజ్యోతి విజేతకు బహుమతి అందజేత



కందుకూరులో కన్సొలేషన్ బహుమతిని అందజేస్తున్న టి.అశోక్

కందుకూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి కార్ అండ్ బైక్ రేస్ లక్కీ డ్రాలో విజేతకు ఆంధ్రజ్యోతి సర్క్యులేషన్ సీఈవో టి.అశోక్ శుక్రవారం మండల కేంద్రంలో బహుమతి అందజేశారు. రంగారెడ్డి జిల్లాలో సుమారు ఎనిమిది మంది పాఠకులు కన్సొలేషన్ బహుమతులు గెలుపొందినట్లు పేర్కొన్నారు. మండల కేంద్రానికి చెందిన గాదె అద్వైత్ బహుమతి గెలుపొందగా ఆయన తండ్రి గాదె రవీందర్‌కు అందజేశారు. పాఠకులకు సమగ్ర సమాచారం ఇవ్వడంతోపాటు ఇలాంటి బహుమతులు అందజేయడానికి ఆంధ్రజ్యోతి యాజమాన్యం నిరంతరం కృషి చేస్తుందన్నారు. బహుమతిని అందుకున్న రవీందర్ మాట్లాడుతూ 14 ఏళ్లుగా ఈ బహుమతికి కోసం పోటీ పడగా ఈ ఏడాది తమకు వచ్చిందని హర్షం వ్యక్తం చేశారు.

వీబీఐటీలో విద్యార్థినుల ఆందోళన

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): తమకు తెలియకుండా ఫొటోలు, వీడియోలు తీసి కళాశాల యాజమాన్యానికి పంపించారని శుక్రవారం విజ్ఞాన భారతి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు ఆందోళనకు దిగారు. రాత్రి హాస్టల్ భోజనంలో పురుగులు వచ్చాయని ఆరోపిస్తూ విద్యార్థులు గురువారం వార్డెన్ రూపను నిలదీసి, ఆందోళన చేపట్టారు. దీంతో వార్డెన్ ఆందోళన చేస్తున్న విద్యార్థినుల ఫొటోలు, వీడియోలు తీసి చీఫ్‌వార్డెన్ సత్యనారాయణగౌడ్‌కు పంపించారు. దీంతో విద్యార్థులు శుక్రవారం తరగతులను బహిష్కరించి ఆందోళనకు దిగారు. వార్డెన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేసి కళాశాల ఆవరణలో వస్తువులను ధ్వంసం చేశారు. ప్రిన్సిపల్ పీవీఎస్ శ్రీనివాస్ విద్యార్థులతో మాట్లాడి విషయం తెలుసుకున్నారు. వార్డెన్ ఫోన్ చూడగా ఎలాంటి అసభ్యకరమైన ఫొటోలు, వీడియోలు లేకపోవడంతో తిరిగి వారి ఫోన్ వారికి ఇచ్చి వార్డెన్‌ను పంపించారు. ఆందోళన ఎక్కువ కావడంతో పోలీసులు చేరుకొని వివాదాన్ని శాంతిపజేశారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర మహిళా కమిషన్ కార్యదర్శి ప్రద్మజారాణి, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వ్యక్తిగత కార్యదర్శి సాధ్య సాయంత్రం కళాశాలకు చేరుకున్నారు. విద్యార్థినులు, కళాశాల యాజమాన్యంతో మాట్లాడారు. నివేదిక తయారు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎవరి వీడియోలు, ఫొటోలు తీయలేదని కళాశాల యాజమాన్యం తెలిపింది.

గ్రామాల్లో బీహార్ సర్పంచ్‌ల పర్యటన

మోమిన్‌పేట్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీమలదరి గ్రామ అభివృద్ధిని బీహార్ రాష్ట్రానికి చెందిన సర్పంచ్‌లు శుక్రవారం పరిశీలించినట్లు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. బీహార్ రాష్ట్రంలోని రాజేందర్‌నగర్‌లోని తెలంగాణ ఐఆర్‌డీలో శిక్షణ పొందుతున్న సర్పంచ్‌లు 30 మంది గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో సీసీ రోడ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ తదితర వాటిని పరిశీలించి పరిపాలన గురించి అడిగి తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో గ్రామం అన్ని విధాలుగా అభివృద్ధి జరగడంతో వారు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీవో యాదగిరి, పంచాయతీ కార్యదర్శి భరత్‌కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కేశవరంలో..

మూడుచింతలపల్లి: మండలంలోని కేశవరం గ్రామ పంచాయతీని శుక్రవారం బీహార్ రాష్ట్రానికి చెందిన 42 మంది సర్పంచ్‌ల బృందం సందర్శించింది. గ్రామ జరిగిన అభివృద్ధి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. వైకుంఠదామం, పల్లెప్రకృతి వనం, అంగన్‌వాడీ కేంద్రం, పీహెచ్‌సీలను సందర్శించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో కాంతమ్మ, డీపీవో సాంబశివరావు, ఎంపీడీవో గీతారెడ్డి, మేడ్చల్ జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలతోనే బీఆర్ఎస్‌లోకి..

- మాజీ మంత్రి సబితారెడ్డి

చేవెళ్ల ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలతోనే ఆ పార్టీ నేతలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని మాజీ మంత్రి సబితారెడ్డి అన్నారు. శుక్రవారం చేవెళ్ల మండల పరిధిలోని రావులపల్లి గ్రామంలో 25 మంది కాంగ్రెస్ నాయకులు ఆమె సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజాపాలన ప్రభుత్వం ప్రజలకు పాలన అందించడంలో విఫలమైందని ఆరోపించారు. రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలందరూ మళ్లీ కేసీఆర్ పాలన కోరుకుంటున్నారని పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారికి మంచి గుర్తింపు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ చేవెళ్ల మండల అధ్యక్షుడు ప్రభాకర్, చేవెళ్ల నియోకజవర్గం యూత్ అధ్యక్షుడు వంగ శ్రీధర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

మలేరియాను కట్టడి చేయాలి


కొడంగల్: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కొడంగల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మలేరియా వ్యాధి సోకకుండా కట్టడి చేయాలని డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో రవీందర్‌యాదవ్ అన్నారు. ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవాన్ని శుక్రవారం కొడంగల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వాసుపత్రి నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి పకీరప్ప పాల్గొన్నారు.

పరిగి: ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం పరిగిలో ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ వెంకటయ్య మాట్లాడుతూ దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కులకచర్ల: మలేరియా వ్యాధి పట్ల ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని కులకచర్ల మండల వైద్యాధికారి కిరణ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి వైద్య సిబ్బంది మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ర్యాలీ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో వైద్యురాలు మాధురి, మెడికల్ అసిస్టెంట్ వెంకట్ పాల్గొన్నారు.

అందని ద్రాక్ష!

(5వ పేజీ తరువాయి)

పలువురు రైతులు తమ భూములను రియల్‌ఎస్టేట్ వ్యాపారులకు విక్రయించడంతో ఆ భూములు కాస్తా ప్లాట్లుగా మారాయి. దీనికితోడు నీటి ఎద్దడి కూడా సాగు విస్తీర్ణం పడిపోవడానికి మరో ప్రధాన కారణంగా చెప్పవచ్చు. ఈ పరిస్థితుల్లో కేవలం పెద్ద రైతులు మాత్రమే ద్రాక్షను సాగు చేస్తున్నారు. ఎంతో కష్టపడి సంవత్సరమంతా సాగు చేసిన ద్రాక్ష పంట చేతికి వచ్చే సమయంలో ఒక్క వడగళ్ల వాన వస్తే చాలు అంతే సంగతులు. పంట పూర్తిగా దెబ్బతింటుంది. అలాగే గతంలో ద్రాక్ష పంట సాగుకు బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు ముందుకువచ్చేవి. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా పోయింది. అలాగే ప్రభుత్వం కూడా ఈ పంట సాగుకు ఎటువంటి సబ్సిడీ ఇవ్వడం లేదు. అలాగే ద్రాక్షలో ఏ అంతర పంటలకూ స్థానం లేదు. జిల్లాలో ఇదే పరిస్థితి కొనసాగితే రెండు మూడేళ్లలో నియోజకవర్గంలో పూర్తిగా ద్రాక్ష సాగు కనుమరుగయ్యే పరిస్థితులు నెలకొన్నాయి.



ద్రాక్ష తోట వద్ద కూరగాయల సాగు

ఈ గ్రామాల్లో అధికంగా సాగు

శామీర్‌పేట మండలంలోని నారాయణపూర్, అనంతారం, కొల్తూరు, మూడుచింతలపల్లి, ఉద్దెమర్రి, పొన్నాల్, శామీర్‌పేట, తూంకుంట, దేవరయాంజాల్ గ్రామాలతో పాటు మేడ్చల్ మండలంలోని యాడారం, రాజబొల్లారం, ఎల్లంపేట, రాయిలాపూర్, కీసర మండలంలోని కీసరదాయరం, భోగారం, రాంపల్లి, ఘట్‌కేసర్ మండలంలోని ఎదులాబాద్, అవుషాపూర్, అంకుషాపూర్ తదితర గ్రామాల్లో ద్రాక్ష పంటను ఎక్కువగా చేస్తారు.

భారీగా పెరిగిన పెట్టుబడి వ్యయం

ద్రాక్ష సాగులో కూలీల కొరత తీవ్రంగా ఉందని పలువురు రైతులు తెలుపుతున్నారు. అప్పట్లో కూలీకి కేవలం రూ.50 మాత్రమే చెల్లించేవారమని ఇప్పుడు అది రూ.800కు పెరిగిందని అయినా అనుకూలమైన రోజుల్లో కూలీలు దొరకడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ద్రాక్షసాగుకు ఎకరాకు రూ. 40 నుంచి రూ.50 వేల వరకు ఖర్చు వచ్చేదని, ఇప్పుడు ఎకరా ద్రాక్ష సాగుకు రూ.1.9 లక్షలుఖర్చు అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఎక్స్‌పోర్టు క్వాలిటీకి అదనపు ఖర్చు

గిట్టుబాటు ధర లేక ఎక్స్‌పోర్టు క్వాలిటీ ద్రాక్షను సాగుచేయడం లేదని రైతులు తెలుపుతున్నారు. మామూలు ద్రాక్ష సాగు కంటే ఎక్స్‌పోర్టు క్వాలిటీ ద్రాక్ష సాగుకు ఎకరాకు దాదాపు రూ.60 వేల వరకు అదనంగా ఖర్చు వస్తుంది. దీనికనుగుణంగా రేట్లు పెరగకపోవడంతో ఆ క్వాలిటీని పండించేందుకు ఇక్కడి రైతులు విముఖత చూపుతున్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

దోమ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. మండలంలోని లింగన్‌పల్లికి చెందిన నాగని దస్తయ్య(40) శుక్రవారం సాయంత్రం దిర్సంపల్లికి పని నిమిత్తం వెళ్లి బైక్‌పై తిరిగి ఇంటికి వస్తుండగా దిర్సంపల్లికి చెందిన చంద్రగంటి శ్రీను, గొల్ల రమేశ్ పాలెపల్లి నుంచి బైక్‌పై దిర్సంపల్లి వెళ్తుండగా పాలెపల్లి సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ఘటనలో నాగని దస్తయ్యకు తీవ్ర గాయాలు కావడంతో వికారాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. దిర్సంపల్లి గ్రామానికి చెందిన శ్రీను, రమేశ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఆనంద్ కుమార్ తెలిపారు.

డోజర్ బ్లేడ్ మీదపడి అటెండర్..

పూడూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): డోజర్ బ్లేడ్ మీదపడి అటెండర్ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని మిర్జాపూర్-పూడూరు మధ్యన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మిర్జాపూర్-పూడూరు మధ్యన గల మైనింగ్ ప్రదేశంలో లాటరైట్ తవ్వకం పనులు చేపట్టారు. ఈ పనుల కోసం ఎంఎస్.రుద్ర మైన్స్ వారు మహారాష్ట్రలోని కొల్హాపూర్ నుంచి రిప్పర్ డోజర్‌ను ట్రైలర్ ద్వారా తరలిస్తున్నారు. ఈ క్రమంలో డోజర్‌ను కిందకు దించే ప్రదేశానికి అటెండర్ అయ్ మోతిలాల్ జాదవ్(20) సూచనలు చేస్తున్నాడు. ఇదే సమయంలో డోజర్ బ్లేడు అజయ్‌పై పడి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు బాధితుడిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు.

గ్రామ సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలి

బషీరాబాద్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని బషీరాబాద్ తహసీల్దార్, గ్రామ ప్రత్యేకాధికారి వై.వెంకటేశ్ అన్నారు. మండలంలోని మంతన్‌గౌడ్ గ్రామాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. పంచాయతీ రికార్డులను పరిశీలించి కార్యదర్శికి పలు సూచనలు చేశారు. వేసవి దృష్ట్యా తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలని కార్యదర్శి దేవేందర్‌కు సూచించారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

- ఉగ్రదాడులను ఖండిస్తూ ముస్లింల నిరసన

వికారాబాద్/యాలాల/ఘట్‌కేసర్/ కీసర రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్ వద్ద జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ దోషులను కఠినంగా శిక్షించాలంటూ వికారాబాద్ పట్టణంలోని ముస్లింలు గురువారం ఉదయం ఎన్నెపల్లి మసీద్ సమీపంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారికి ఘన నివాళులర్పిస్తూ వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అదేవిధంగా యాలాల మండల కేంద్రంలో జామా మస్జిద్ వద్ద జుమ్మ నమాజ్ తర్వాత ముస్లింలు ఉగ్రదాడిని ఖండిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మౌలానా మాజ్, అక్బర్ బాబా, హైమద్, సులేమాన్, గంతల్ మైను పాల్గొన్నారు. ఘట్‌కేసర్‌లో ముస్లింలు ఉగ్రదాడిని నిరసిస్తూ శుక్రవారం భారీ ప్రదర్శన నిర్వహించారు. స్థానిక జామియా మసిదులో ప్రార్థనలు ముగిసిన అనంతరం మసీదు నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మహ్మద్ అబ్దుల్ ఖయ్యూం, పాషా, ఖుర్షిద్, అన్ను, రఫీయొద్దీన్, షారుక్, జావీద్, ఖలీల్, రహమాన్, తదితరులు పాల్గొన్నారు. ఉగ్ర మూకలకు బదులు చెప్పాల్సిందేనని కేజీఆర్ కళాశాల డైరెక్టర్ రమణారావు అన్నారు. నాగారం మున్సిపాలిటీ రాంపల్లిలోని కేజీఆర్ కళాశాలలో శుక్రవారం ఉగ్రదాడి మృతులకు నివాళులర్పించారు. అనంతరం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల బోధనా సిబ్బంది ప్రొఫెసర్లు విజయలక్ష్మి, విజయకుమార్, రంగేశ్వర్, సునీత, డాక్టర్ శిల్పిక స్రవంతి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.


వికారాబాద్: ఎన్నెపల్లి మసీదు వద్ద నిరసన తెలుపుతున్న ముస్లింలు



ఘట్‌కేసర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు


యాలాలలో నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లింలు


కీసర రూరల్: ర్యాలీ నిర్వహిస్తున్న కళాశాల విద్యార్థులు

డెలివరీల్లో తాండూరు ఆస్పత్రి టాప్

(5వ పేజీ తరువాయి)

ఈ ఆస్పత్రికి వస్తారు. ఇటీవల రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ జూమ్ మీటింగ్‌లో తాండూరు ఆస్పత్రి సూపరింటెండెంట్ రవి శంకర్‌తోపాటు ప్రసూతి విభాగంలో పని చేస్తున్న సిబ్బందిని అభినందించారు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లా ఆస్పత్రులుండగా 305 డెలివరీలతో గజ్వేల్ ఆస్పత్రి రెండో స్థానంలో, 202 డెలివరీలతో హైదరాబాద్‌లోని కొండాపూర్ ఏరియా ఆస్పత్రి మూడో స్థానంలో నిలిచింది.

అందరి కృషితోనే సాధ్యమైంది

తాండూరు మాతాశిశు ఆస్పత్రిలో అందరి సహకారంతోనే రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచాం. డాక్టర్లు, ఏఎన్ఎంలు, నర్సులు, ఆయాలు చేసిన కృషి ఫలితంగానే మంచి ఫలితాలు వచ్చాయి. మున్ముందు కూడా ఆస్పత్రిలో నార్మల్ డెలవరీల సంఖ్యను మరింత పెంచుతాం. ఆస్పత్రిలో మహిళలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. - డాక్టర్ రవిశంకర్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్

కాంగ్రెస్ నేతకు పరామర్శ


కాంగ్రెస్ నేత బిచ్చిరెడ్డిని పరామర్శిస్తున్న శుభప్రద్‌పటేల్

బషీరాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతున్న మైల్వార్ కాంగ్రెస్ నేత బిచ్చిరెడ్డిని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్ శుక్రవారం పరామర్శించారు. వికారాబాద్‌లోని మిషన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బిచ్చిరెడ్డిని కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. కుటుంబ సభ్యులతో మట్లాడి ధైర్యం చెప్పారు.

ఏఈపై చర్యలు తీసుకోవాలి


ఏడీకి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

తాండూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణంలో కొత్త కరెంటు మీటర్లు ఇవ్వడంలో విద్యుత్ శాఖ ఏఈ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆయనపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.శ్రీనివాస్ ఆరోపించారు. ఆయన ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు శుక్రవారం విద్యుత్ శాఖ ఏడీ కార్యాలయంలో ఏడీకి వినతిపత్రాన్ని అందజేశారు. జీరో బిల్లు కొట్టకుండా 200 యూనిట్లకు పైగా కొట్టి బిల్లులు కట్టాలని ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు సతీష్, మల్కయ్య, ఎల్లయ్య, అంజయ్య, శివ, వినోద్, సురేష్, బాలస్వామి, ధనియాలు పాల్గొన్నారు.

వైభవంగా కాటమయ్య జాతర


బోనాలతో వస్తున్న మహిళలు

తాండూరు రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జినుగుర్తిలో గౌడ కులస్తుల ఆరాధ్య దైవం కాటమయ్య జాతర ఘనంగా నిర్వహించారు. కాటమయ్య దేవాలయం 5వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం గౌడ కులస్తులైన శ్రీనివాస్‌గౌడ్, ప్రవీణ్‌గౌడ్, నరేష్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించి, స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలు బోనాలతో తరలివచ్చి నైవేద్యం సమర్పించారు. బోనాల ఊరేగింపులో పోతరాజుల విన్యాసాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, నాయకులు పి.ఉత్తంచంద్, నరేందర్‌గౌడ్, నాగేందర్‌గౌడ్, రాజుగౌడ్ పాల్గొన్నారు.

నంబిగురుస్వామి ఆలయంలో..

నవాబుపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మారెడ్డిపల్లిలో నంబిగురుస్వామి జాతర వైభవంగా జరిగింది. ఉత్సవాల్లో బాగంగా భక్తులు ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ మాజీ సర్పంచ్ సామ పద్మ వెంకటిరెడ్డి ఆలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పద్మ నాగిరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నర్సింహారెడ్డి, మాజీ వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు


మాజీ ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరిన నాయకులు

బంట్వారం ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సల్బత్తపూర్, మద్వాపూర్ గ్రామాలకు చెందిన బీఎస్పీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆనంద్, అబిలాష్, మల్లయ్య, శ్రీశైలం, గణేష్, నవీన్, శ్రీశైలం, అజయ్ మహేందర్, తదితరులు శుక్రవారం వికారాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆయన వారికి గులాబీ కండువా కప్పిపార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ బంట్వారం మండల అధ్యక్షుడు మల్లేశం, కార్యనిర్వాహక అధ్యక్షుడు శ్రీనివాస్, బంట్వారం మండల పార్టీ ఉపాధ్యక్షుడు అశోక్ ముదిరాజ్, నాయకులు ప్రవీణ్ గోరెమియా, నర్సింహులు, వీరేశం, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించి వాహనాన్ని నడపాలి


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ

తాండూరు రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్లు ధరించి వాహనాన్ని నడపాలని పోలీసులు వాహనదారులకు అవగాహన కల్పించారు. కరన్‌కోట్ ఏఎస్ఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం తాండూరు మండలం జినుగుర్తి ఎక్స్ రోడ్డులో వెళ్లే ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

అకాల వర్షం.. తీరని నష్టం

మోమిన్‌పేట్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మోమిన్‌పేట్ మండలంలో శుక్రవారం రాత్రి ఈదురుగాలులు, అకాల వర్షం కురిసింది. పలు గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలు చేతికొచ్చే సమయంలో దెబ్బతిన్నాయి. దీంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. మోమిన్‌పేట్-వికారాబాద్ మార్గంలో ఈదురుగాలులకు చెట్టు విరిగి రోడ్డుపై పడటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

మర్పల్లి: రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షం, ఈదురుగాలులకు మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. బిల్కల్ గ్రామానికి చెందిన బొజ్జ సుధారాణికి తుమ్మలపల్లి గ్రామంలో దాదాపు 6ఎకరాల పొలం ఉంది. అందులో బొప్పాయి, మామిడి, వంకాయ, మిర్చీ, బీర్నీస్ తదితర పంటలను సాగుచేశారు. పంట పెట్టుబడికి రూ.7లక్షల వరకు ఖర్చు చేసినట్లు ఆమె తెలిపారు. దెబ్బతిన్న పంటలను అధికారులు పరిశీలించి పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈదురుగాలులకు మండలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వికారాబాద్: పట్టణంలో శుక్రవారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఆకాశం పూర్తిగా మేఘావృతమై పూర్తిగా చీకటి కమ్ముకుంది. పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడగా పలు ప్రాంతాల్లో చెట్లు విరిగి పడ్డాయి


మోమిన్‌పేటళ్-వికారాబాద్ మార్గంలో రోడ్డుపై విరిగి పడిన చెట్టు

కోట్‌పల్లి: మండలంలోని బార్వాద్, ఎన్నారం, ఎన్కెపల్లి, తదితర గ్రామాల్లో శుక్రవారం కురిసిన భారీ వర్షానికి రైతులకు నష్టం వాటిల్లింది. ఎండలో ఎండ పెట్టిన పసుపు రైతులకు తిప్పలు తప్పలేదు. విద్యుత్ అంతరాయంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు


కులకచర్ల: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీసీ ఉపాధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్

చౌడాపూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యం విక్రయాల్లో దళారులను నమ్మి మోసపోవద్దని పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్ అన్నారు. చౌడాపూర్ మండలంలోని చౌడాపూర్, మరికల్, మల్కాపూర్, కొత్తపల్లి గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్‌చైర్మన్ నాగరాజు, దామోదర్‌రెడ్డి, సలీమ్, శేఖర్, నర్సింహారెడ్డి, సత్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కులకచర్ల: మండల కేంద్రంలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, మార్కెట్ కిమటీ చైర్మన్ అంజనేయులు శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాంబండ ఆలయ చైర్మన్ మైపాల్ రెడ్డి, తహసీల్దార్ మురళీధర్, ఎంపీడీవో రామకృష్ణ, ఏపీయం శోభ, సంతోష, శ్రీలత, భరత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్: అప్పాయిపల్లిలో శుక్రవారం గ్రామ స్నేహ సంఘం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీవో ఉషశ్రీ, పీఏసీఎస్ చైర్మన్ కే.శివకుమార్ గుప్త మాట్లాడుతూ రైతులు ధాన్యం విక్రయాల్లో దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీయం వెంకన్న, వాణిశ్రీ, లక్ష్మి పాల్గొన్నారు.

మహిళా సింహగర్జన సభను జయప్రదం చేయాలి


సింహగర్జన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న భాగ్యలక్ష్మి, తదితరులు

కొడంగల్ రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఓబీసీ సెంట్రల్ కమిటీ, జాతీయ బీసీ మహిళా సమాఖ్య అనుబంధ సంఘాలు సంయుక్తంగా మే 30న సరూర్‌నగర్ స్టేడియం చాకలి ఐలమ్మ ప్రాంగణంలో నిర్వహిస్తున్న మహిళా సింహ గర్జన సభను విజయవంతం చేయాలని ఓబీసీ తెలంగాణ చైర్ పర్సన్, ఓబీసీ తెలంగాణ ఆరెకటిక సమాజ్ కన్వీనర్ యం.భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు. కొడంగల్‌లో శుక్రవారం జాతీయ ఆదివాసీ గిరిజన ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు రమేశ్‌తో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నారి శక్తి తెలంగాణ ఉపాధ్యక్షురాలు విమల, మైనారిటీ సెక్రటరీ అహ్మద్ బాబా పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించారని కార్యదర్శి ఫిర్యాదు

బషీరాబాద్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఇంటి పన్ను చెల్లించి ఇసుక పర్మిషన్‌కు అనుమతి తీసుకోవాలని కోరగా ససేమిరా అంటూ విధులకు ఆటంకం కలిగించిన ఓ నాయకుడిపై పంచాయతీ కార్యదర్శి బషీరాబాద్ పోలీసులకు ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. ఈ ఘటన శుక్రవారం వెలుగుచూసింది. పంచాయతీ కార్యదర్శి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గొట్టిగఖుర్దు గ్రామానికి చెందిన పంచాయతీ కార్యదర్శి ఫేరోజ్‌బేగం గురువారం కార్యాలయంలో ఉండగా స్థానిక నాయకుడు వెంకట్‌రెడ్డి ఫోన్‌చేసి ఇసుక అనుమతి కోసం లేటర్ ఇవ్వాలని అడిగాడు. ఈ క్రమంలో కార్యదర్శి ఇంటి ట్యాక్సు చెల్లించి తీసుకోవాలని చెప్పగా కార్యదర్శి, సదరు నాయకుడి మధ్య మాటల యుద్ధం కొనసాగింది. అంతటితో ఆగకుండా సదరు నాయకుడు పంచాయతీ కార్యాలయం వద్దకు చేరుకుని కార్యదర్శితో వాదనకు దిగాడు. పంచాయతీ కార్యదర్శి ఈ విషయం ఎంపీడీవో విజయ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి ఆయన ఆదేశానుసారం బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదుపై శుక్రవారం పంచాయతీ కార్యదర్శి, సదరు నాయకుడిని బషీరాబాద్ ఎస్‌ఐ పిలిపించి విచారణ జరిపారు. కాగా అక్కడికి వచ్చిన నాయకులు కొందరు పోలీస్‌స్టేషన్‌లోనే పంచాయతీ పెట్టి కార్యదర్శిని కేసు వాపసు తీసుకోవాలని ఒత్తిడి చేసినట్లు సమాచారం. ఈ విషయమై ఎస్‌ఐని ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులో రాలేదు.

కర్రెగుట్టల్లో కూంబింగ్ నిలిపి వేయాలి

నవాబుపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): చత్తీస్‌గడ్‌లోని గూడూరు బ్లాక్ కర్రెగుట్ట ప్రాంతంలో కూంబింగ్ నిలిపి వేయాలని ప్రజాఫ్రంట్ జిల్లా కన్వీనర్ నాగభూషణం శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శాంతిచర్చలకు మావోయిస్టు పార్టీతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపాలని కోరారు. ఆదివాసీలకు మావోయిస్టులను చెప్పి హతమర్చున్నట్లు తెలిపారు. మావోయిస్టు పార్టీతో చర్చలు జరిపి శాంతియుతంగా మాట్లాడాలని ఆయన కోరారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్, అత్వేల్లి, ఎల్లపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం చేపడుతున్న మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 2గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

గ్రామగ్రామాన గులాబీ జెండా ఎగరాలి

తాండూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): తాండూరు నియోజకవర్గంలో బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఈనెల 27న గ్రామగ్రామాన గులాబీ జెండాలను ఎగురవేయాలని తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పార్టీ నేతలను, కార్యకర్తలను కోరారు.

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను కలిసిన నర్మద కిష్టప్ప

కొడంగల్: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను మండలంలోని అంగడిరైచూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకురాలు నర్మద కిష్టప్ప కలిశారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు కొడంగల్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని ఆమె కోరారు.

పరిపాలనలో రాజ్యాంగమే ప్రధానం


భారత సంవిధాన్ కార్యక్రమంలో నాయకులు

కోట్‌పల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): భారతదేశ పరిపాలనలో మతాలు, కులాలు ప్రాముఖ్యం కాదని, భారత రాజ్యంగమే ప్రధానమని కోట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింగ్ నాయక్ అన్నారు. మండలంలోని కరీంపూర్, బీరోల్, తదితర గ్రామాల్లో శుక్రవారం భారత సంవిదాన్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఆయూబ్ అన్సారి, వాహీద్ మియా, నర్సింహారెడ్డి, వెంకట్ రామిరెడ్డి, నర్సింహులు, జగన్నాథ్ రెడ్డి పాల్గొన్నారు.

వీహెచ్‌పీ పొల్కంపల్లి గ్రామ కమిటీ ఎన్నిక


నూతన వీహెచ్‌పీ గ్రామ కమిటీ సభ్యులు

పరిగి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): హిందూ సంప్రదాయాలను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంటుందని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) జిల్లా కార్యదర్శి మహేందర్‌జీ అన్నారు. మండలంలోని పొల్కంపల్లిలో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ పొల్కంపల్లి గ్రామ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బి.మధుసూధన్‌రెడ్డి, అధ్యక్షుడిగా కె.వెంకట్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి వీరేశంలు ఎన్నికయ్యారు.

రైల్వేస్టేషన్‌లో చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రం ప్రారంభిస్తున్న మంచ్ ప్రతినిధులు

తాండూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): తాండూరు మార్వాడీ యువ మంచ్ ఆధ్వర్యంలో స్థానిక రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్‌లో శుక్రవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ప్రయాణికుల దాహార్తిని తీర్చడానికి రైల్వేఅధికారులు, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ అరుణ్ కుమార్ అభ్యర్థన మేరకు సమాజ్ దాతల సహకారంతో మినరల్ వాటర్‌తో చలివేంద్రం ప్రారంభించినట్లు మంచ్ అధ్యక్షుడు అనిల్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచ్ జాతీయ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు మన్మోహన్ సార్దా, మంచ్ కార్యదర్శి సచిన్ రాటి, అరుణ్ సార్దా, సునీల్ సార్దా, కిషన్ రాటి, దీపక్ బూబ్, నిహార్ సోమాని, నిఖిల్ పాల్గొన్నారు.